సాక్షి పల్నాడు

గురువారం । 8 । ఆగస్టు । 2024



వెండి కిరీటాలు బహూకరణ

కొల్లూరు: కొల్లూరుకు చెందిన సూరపనేని ప్రసాదరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వెండి కిరీటాలను అనంతభోగేశ్వర ఆలయంలోని దేవతామూర్తులకు వితరణ చేశారు.



49,224 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 47,647 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి 49,224 బస్తాలు అమ్మకాలు జరిగాయి.



వైభవంగా పుష్పయాగం

నగరంపాలెం: గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం గోదా అమ్మవారి తిరునక్షత్రం సందర్భంగా పుష్పయాగం వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

గోదాదేవి తిరునక్షత్ర మహోత్సవం



తాడేపల్లిరూరల్: సీతానగరంలోని విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై బుధవారం గోదాదేవి తిరునక్షత్ర మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ పరమహంస పరివ్రాజకులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళ శాసనాలతో ఉదయం 9 గంటలకు గోదాదేవి అమ్మవారికి తిరుమంజనం (అభిషేకం), తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించామని, మహిళా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని గోదాదేవిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. కార్యక్రమంలో విజయకీలాద్రి దేవస్థాన అర్చకులు, జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వేదపండితులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


రేపు హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాం ఎంపికలు

గుంటూరుఎడ్యుకేషన్:గుంటూరు జిల్లా ఉపాధి కార్యాలయం, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9న హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రఘు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీ రంగంలో కెరీర్‌ను ప్రారంభించేందుకు ఆసక్తి కలిగి 2023, 2024 సంవత్సరాల్లో ఇంటర్ నాన్ మాథ్స్ (సీఈసీ, హెచ్‌ఈసీ, బైపీసీ, ఒకేషనల్) కోర్సులను 75 శాతం మార్కులతో పూర్తి చేసిన యువతీ, యువకులు అర్హులని తెలిపారు. సంబంధిత అభ్యర్థులు బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉన్న ప్రభుత్వ ఐటీఐలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్న హెచ్‌సీఎల్ ఎర్లీ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలని సూచించారు. రాత పరీక్ష, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారని, ఇతర వివరాలకు 80746 07278 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

13న భవిష్యనిధి పెన్షన్ అదాలత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు కృష్ణనగర్‌లోని భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయంలో ఈనెల 13న పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని పీఎఫ్ పెన్షనర్లు వారి ఫిర్యాదులు, దరఖాస్తులను నేరుగా భవిష్యనిధి కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న పెన్షన్ అదాలత్‌లో సమర్పించవచ్చని తెలిపారు. వ్యక్తిగతంగా హాజరు కాలేని వారు ఆన్‌లైన్, వాట్సాప్, వెబ్ మార్గాల ద్వారా పంపవచ్చని సూచించారు. ro.guntur@epfindia.gov.inతో పాటు వాట్సాప్ నంబరు 94946 57469కు పంపాలని తెలిపారు. ల్యాండ్‌లైన్ నంబర్లు 0863–2344106, 2232921 నంబర్లో సంప్రదించాలని పేర్కొన్నారు. అదే విధంగా వెబ్ ఎక్స్ ఐడీ 2644 636 3676, పాస్‌కోడ్ epfo@1234 ద్వారా లాగిన్ కావాలని తెలిపారు. పీఎఫ్ పెన్షన్ దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యనిధి పింఛనుదారులు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని పీఎఫ్ కమిషనర్ తెలిపారు. పింఛను పొందుతున్న వారు బ్యాంకు, సీఎస్‌సీ, పీఎఫ్ కార్యాలయం ద్వారా పోస్ట్ ఇన్ఫో యాప్ ద్వారా లైఫ్‌సర్టిఫికెట్లు సమర్పించాలని, లేకుంటే పోస్ట్‌మెన్ నేరుగా ఇంటికే వచ్చి వేలిముద్ర, ఐరిష్, స్కాన్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్ స్వీకరిస్తారని తెలిపారు. ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ఆధార్ ఫేస్ యాప్, జీవన ప్రమాణ ఫేస్ అప్లికేషన్ ఉపయోగించి ఆధార్ నంబరుతోనూ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించవచ్చునని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు పీఎఫ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 6,034 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 296, బ్యాంక్ కెనాల్‌కు 1578, తూర్పు కెనాల్‌కు 640, పశ్చిమ కెనాల్‌కు 270, నిజాంపట్నం కాలువకు 380, కొమ్మమూరు కాలువకు 2880 క్యూసెక్కులు విడుదల చేశారు.

ఎగువ నుంచి వరద నీరు వస్తుండడంతో కృష్ణమ్మ జలకళను సంతరించుకుంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు సాధారణ స్థాయికి చేరుకోవడంతో 18 క్రస్ట్‌గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో దిగువ ప్రాంతాలకు వరద నీరు పోటెత్తుతుంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. జిల్లాలోని మేళ్లవాగు, కొండవీటి వాగు, మద్దూరు, నక్కల వాగు పొంగిపొర్లుతున్నాయి. ఆయా మార్గాలలో రాకపోకలు స్తంభించాయి. కృష్ణా పరివాహక ప్రాంతంలోని గ్రామాల్లోకి వరదనీరు వచ్చి చేరుతుండడంతో అప్రమత్తమైన అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అమరావతిలోని అమరేశ్వర ఘాట్ వద్ద జలకళ సంతరించుకున్న కృష్ణానది



పోటెత్తుతున్న వరద

కృష్ణమ్మకు జలకళ

- సాగర్ నుంచి భారీగా వరద నీరు విడుదల
- జిల్లాలో పొంగుతున్న వాగులు
- స్తంభించిన రాకపోకలు –అప్రమత్తమైన అధికారులు
- సురక్షిత ప్రాంతాలకు ముంపు గ్రామాల ప్రజలు

అమరావతి: పులిచింతల ప్రాజెక్టు నుంచి బుధవారం సుమారు రెండు లక్షల క్యూసెక్కులు విడుదల చేయటంతో అమరావతి వద్ద కృష్ణానది జలకళ సంతరించుకుంది. వరదనీరు భారీగా వస్తుండటంతో అమరావతి మండలంలోని సుమారు 30 కిలోమీటర్ల మేర నదీ పరివాహక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. కృష్ణమ్మను తిలకించేందుకు అమరావతిలోని అమరేశ్వర, ధ్యానబుద్ధ ఘాట్‌ల వద్దకు ప్రజలు తరలివస్తున్నారు. ఘాట్‌లలో ప్రమాదాలు జరగకుండా పూర్తిస్థాయిలో భద్రతా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కృష్ణానది కూడా ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రవాహం ఎదురు తన్ని మేళ్లవాగు, కొండవీటి వాగు, మద్దూరు వాగులలో భారీగా వరదనీరు ప్రవహిస్తోంది. అమరావతి–క్రోసూరు రహదారిలో ఊటుకూరు వద్ద నక్కలవాగు పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి.



పులిచింతల పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రమణకాంత్‌రెడ్డి

ముంపు గ్రామాల్లో ఆర్డీఓ పర్యటన

మాచవరం: పులిచింతల ముంపు గ్రామాలు భీమవరం, రేగులగడ్డల్లో గురజాల ఆర్డీఓ రమణకాంత్‌రెడ్డి బుధవారం పర్యటించారు. ఎగువ నుంచి వరద నీరు పులిచింతల ప్రాజెక్టుకు చేరడంతో ఆయా గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి నష్టం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ముంపు గ్రామాల వైపు ప్రజలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పెదరెడ్డిపాలెంలో రాకపోకలు బంద్

నరసరావుపేటరూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నరసరావుపేట మండలం పెదరెడ్డిపాలెం సమీపంలోని వాగు పొంగి ప్రవహిస్తోంది. ఆ మార్గంలో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. చప్టాపై నుంచి రెండు అడుగుల మేర నీరు ప్రవహిస్తుండంతో గ్రామస్తులతో సంబంధాలు తెగిపోయాయి. పెదరెడ్డిపాలెం నుంచి రాకపోకలు సాగించే వాహనాలు పూర్తిగా నిలిచాపోయాయి. వాగు ఉధృతి కారణంగా గ్రామం నుంచి ప్రయాణించే ప్రైవేటు పాఠశాలల బస్సులు నిలిచిపోయాయి.



పెదరెడ్డిపాలెం సమీపంలో పొంగి ప్రవహిస్తున్న వాగు

కప్పల వాగు వద్ద రక్షణ

ఊటుకూరు(క్రోసూరు): మండలంలోని ఊటుకూరు వద్ద కప్పల వాగు పొంగి ప్రవహిస్తోంది. అచ్చంపేట, క్రోసూరు నుంచి అమరావతి మీదగా గుంటూరు వెళ్లే ఆర్టీసీ బస్సులు రాకపోకలు నిలిచిపోయాయి. అమరావతి పరిధి గ్రామాలు, క్రోసూరు శివారు గ్రామమైన బయ్యవరం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్‌ఐ ఎం.షఫీ పొంగి ప్రవహిస్తున్న కప్పలవాగును సందర్శించారు. పరిస్థితి సమీక్షించి కాపలా ఏర్పాటుచేశారు. కప్పలవాగు నుంచి వెళ్లకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. అమరావతి బెల్లంకొండ డబుల్‌రోడ్డు నిర్మాణంలో భాగంగా ఊటుకూరు వద్ద కప్పలవాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తాత్కాలికంగా పక్కనే ఉన్న తాత్కాలిక అప్రోచ్ రోడ్డు మీద నుండి రాకపోకలు సాగిస్తున్నారు. వాగు పొంగి రాకపోకలు నిలిచిపోయాయి.



పొంగిప్రవహిస్తున్న కప్పలవాగు

ప్రమాదభరితంగా వాగులు

రెంటచింతల: మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఉన్న గోలి వాగు, పిల్లి వాగు, ఏడు మంగళం వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గోలి గ్రామ సమీపంలోని గోలి వాగు ప్రమాదభరితంగా ప్రవహిస్తుండటంతో గోలి గ్రామం నుంచి పశర్లపాడు, జెట్టిపాలెం, మల్లవరం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం 25.6 మి.మీ, బుధవారం 30.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ కాంట్రాక్ట్ సూపర్‌వైజర్ బద్దిగం ఈశ్వర్‌రెడ్డి తెలిపారు.



గోలి వద్ద ప్రవహిస్తున్న గోలి వాగు

పొందుగల వద్ద పరవళ్లు

దాచేపల్లి: మండలంలోని పొందుగల వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుంది. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్ల నుంచి దిగువకు నీరు విడుదల చేస్తుండటంతో బుధవారం కృష్ణానది దిగువ ప్రాంతంలో పొంగి ప్రవహిస్తోంది. నిన్నటి వరకు వెలవెలబోయిన కృష్ణమ్మ నేడు ఉరకలేస్తూ పరుగులు తీస్తుంది. కృష్ణానదిలో ప్రవహిస్తున్న నీటిని తిలకించేందుకు చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలు తరలివస్తున్నారు.



పొందుగల వద్ద కృష్ణానది.

రైతుల్లో సంతోషం

రెంటచింతల: మండలంలో మంగళ, బుధవారాలలో కురిసిన వర్షంతో రైతులలో హర్షం వ్యక్తం అవుతుంది. ఖరీఫ్ ప్రారంభమై రోజులు గడుస్తున్నా సరైన వర్షాలు కురవక పోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు పత్తి, మిర్చి, కంది, జొన్న తదితర పంటలకు ఎంతో మేలు చేస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వరి నారుకు పై మందులు చల్లుతున్నారు.



మిట్టగుడిపాడు గ్రామ శివారులో వరి నారుకు పైమందు చల్లుతున్న రైతు

జీవం కోల్పోయిన జీవనది



వాగులో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న వ్యర్థాలు, పెరిగిన గడ్డి



వీరుల గుడి వైపు కూడా వ్యర్థాల మయంగా కన్పిస్తున్న నాగులేరు

- దురవస్థలో పల్నాటి నాగులేరు
- వ్యర్థాలతో నిండిన వాగు
- ఆక్రమణలతో కుచించుకుపోతున్న వైనం
- యథేచ్ఛగా తవ్వకాలు

కారెంపూడి: ఒకప్పటి జీవనది నాగులేరు నేడు దురవస్థలో ఉంది. పల్నాటి చరిత్రలో జీవనదిగా పేర్కొనబడి దానికి తగినట్లే 1990 ప్రాంతం వరకు నాగులేరు పరివాహక గ్రామాల ప్రజలకు ప్రధాన నీటి వనరుగా ఉపయోగపడింది. కారెంపూడి గ్రామ ప్రజల నీటి అవసరాలను వాగే తీర్చింది. అలాంటిది ఆ తర్వాత కాలం నుంచి పాడైపోవడం ప్రారంభమైంది. బస్టాండ్ సెంటర్‌లో పోగైన వ్యర్థాలన్నీ బ్రిడ్జిపై నుంచి వాగులో పడేస్తున్నారు. దీంతో వాగు వ్యర్థాలతో నిండిపోతోంది. దీనికి తోడు వాగులో జమ్ము, తుంగ, తూడికాడ వంటివి తోడు కావడంతో అవి మొత్తం నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. దీంతో నిల్వ ఉండి కుళ్లిపోయిన వ్యర్థాల నుంచి దుర్వాసన కూడా వస్తోంది. బస్టాండ్ నుంచి గ్రామానికి తూర్పుగా నాగులేరు ప్రవహిస్తోంది. ఎంతో చక్కటి నీటి వనరు. ఆహ్లాదకరమైన వాతావరణం సృష్టించుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కానీ వీరుల గుడి వద్ద చెక్‌డ్యాం నిర్మించారు. ఆ తర్వాత వాగుకు ఇరువైపులా ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేదు. నాగులేరు పక్కనే పార్కు ప్రాంతం కూడా ఉంది. వాస్తవానికి నాగులేరు పరివాహ ప్రాంతం చాలా విశాలమైంది. వినుకొండ బ్రిడ్జికి ఆవల వైపే దాదాపు 11 ఎకరాల దాకా ఉందని గతంలో ఒక సర్వేలో తేలింది. వాగు ప్రవహిస్తున్న 38 కిలోమీటర్ల పరిధిలో ఇంకా చాలా ఉంది. చాలా వరకు వాగు ప్రాంతం ఆక్రమణలకు కూడా గురవుతోంది. వాగులో ఇసుక కంకరతో నిండిన గ్రావెల్‌ను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. మండలంలో ఎవరు ఇళ్లు కడుతున్నా వాగు కంకర ఇసుకే ఆధారమైంది. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారం వాగులో స్తంభం లోతు గుంతలు పెడుతున్నారు. వాగు పరిరక్షణకు చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఇది కనుమరుగయ్యే ప్రమాదం కూడా పొంచి ఉంది. మరో వైపు నాగులేరులో కలిసే ఇసుకవాగు ఇతర చిన్న చిన్న వాగుల స్థలాలన్నీ కబ్జా అవుతున్నాయి. అలా కబ్జాలు నాగులేరు వైపు కదులుతున్నాయి.

పల్నాటి వీరుల రక్తం పారిన పవిత్ర నది నాగులేరు

పల్నాటి వీరుల గుడికి పడమరగా దక్షిణం నుంచి ఉత్తరానికి నాగులేరు ప్రవహిస్తూ కృష్ణానదిలో కలుస్తుంది. మధ్యలో అనేక వాగులు నాగులేరులో కలుస్తాయి. చారిత్రక ప్రసిద్ధి చెందిన పల్నాటి యుద్ధం కూడా కారెంపూడి నాగులేరు ఒడ్డునే జరిగింది. పల్నాటి వీరుల రక్తం నాగులేరులో ప్రవహించింది. ఇప్పటికీ నాగులేరు గంగధారి మడుగు పల్నాటి వీరాచారవంతులకు పరమపవిత్రమైంది. పల్నాటి వీరుల ఆయుధాలకు కూడా అక్కడే శుభ్రం చేస్తారు. ఆచారవంతులు పుణ్య స్నానాలాచరిస్తారు. అలాంటి పవిత్రమైన చారిత్రక నేపథ్యం కూడా ఉంది. అందుకే నేమో నాగులేరును శ్రీనాథుడు కాశీలోని మణికర్ణిక నది అంతటి పవిత్రమైనది పేర్కొన్నారు. ప్రస్తుతం నాగులేరుకు దగ్గరలోనే చెన్నకేశవస్వామి, వీర్ల అంకాలమ్మ ఆలయాలున్నాయి.

పంట నమోదుకు గ్రీన్ సిగ్నల్

- ఈ–పంట నమోదుకు అధికారుల చర్యలు
- జియో ఫెన్సింగ్‌తో కచ్చితమైన వివరాలు
- ఈ–పంటతో అధిక ప్రయోజనాలు
- జిల్లాలో 2,48,350 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం
- ఖరీఫ్ నమోదుకు సెప్టెంబర్ 15వ తేదీ తుది గడువు

సత్తెనపల్లి: అన్నదాతలు ఖరీఫ్‌లో సాగు చేసే పంటల వివరాలను గుర్తించేందుకు ఈ– పంట నమోదుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికోసం వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేసేందుకు ఈ–పంట విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ–పంట నమోదు చేయించుకోవాల్సిన బాధ్యత ప్రతి రైతుపై ఉంది. ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుకోవాలంటే ఈ–పంటలో తప్పనిసరిగా సాగు వివరాలు నమోదు చేసుకోవాలి. గతంలో ఉన్న విధానంలో ప్రభుత్వం స్వల్పంగా మార్పులు చేసింది. ఈ ఏడాది ఈ–పంట నమోదులో కచ్చితమైన సమాచారం కోసం మార్పులు చేపట్టారు. గతేడాది నుంచే జియోఫెన్సింగ్ విధానాన్ని అమలు చేస్తుండగా, కొత్తగా ఫేషియల్ రికగ్నిషన్, ఈ ఫిష్ డేటా అప్రూవల్, అబ్జక్షన్‌బుల్ లాండ్స్‌లో వేసే పంట నమోదును ఈ–పంటలో చేర్చడాన్ని సులభతరం చేశారు. ఈ విధానంలో రైతుకు, కౌలు రైతుకు ప్రయోజనం ఉంటుంది. కచ్చితమైన సమాచారం ప్రభుత్వానికి చేరుతుంది. ఫలితంగా అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందే అవకాశం ఉంది.



ఈ–పంట నమోదు చేస్తున్న సిబ్బంది

శ్రీకారం చుట్టిన వ్యవసాయ శాఖ

జిల్లాలో ఈ–పంట నమోదుకు వ్యవసాయ, రెవెన్యూ శాఖలు శ్రీకారం చుట్టాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను రైతులు అతివృష్టి, అనావృష్టితో ఎప్పటికప్పుడు నష్టపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో వారు పరిహారం పొందేందుకు అధికారులు, మీ–సేవ కేంద్రాల చుట్టూ తిరిగేవారు. వీరి కష్టాలను గుర్తించిన వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సిబ్బందితో రైతు ఫొటోతోపాటు పొలం వద్దే వివరాలు నమోదు చేస్తున్నారు. గత ఏడాది నుంచి జియో ఫెన్సింగ్ విధానం అమలు చేస్తున్నారు. కచ్చితంగా రైతు పొలం వద్దకే వెళ్లి వివరాలు నమోదు చేస్తేనే యాప్‌లో నమోదు అవుతుంది. దీనివల్ల ప్రభుత్వానికి కచ్చితమైన సమాచారం చేరుతుంది. ఈ–పంట ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాలు నేరుగా అందుతాయి. ప్రస్తుత వ్యవసాయ సిబ్బంది ఈ–పంట నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా ఖరీఫ్‌కు ఈ–పంట నమోదు సెప్టెంబర్ 15వ తేదీతో ముగుస్తున్నందున రైతులు త్వరపడాలని వ్యవసాయ శాఖ సూచిస్తుంది.

రైతులందరూ నమోదు చేయించుకోవాలి



రైతులందరూ తప్పనిసరిగా సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ–పంటలో నమోదు చేయించుకోవాలి. రైతుసేవ కేంద్రాల ద్వారా సిబ్బంది నమోదు చేస్తారు. దీని ఆధారం గానే రైతులకు లభించే ప్రయోజనాలు చేకూరుతాయి. ఈ–పంట నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా యంత్రాంగం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తుంది. ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి.

–ఐ.మురళి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, పల్నాడు

నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టండి

జేసీ సూరజ్ గనోరే

నరసరావుపేటఈస్ట్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా నైపుణ్య శిక్షణా తరగతులు తరచూ నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జేసీ అధ్యక్షతన జిల్లా నైపుణ్యాభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదనీ, అందుకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా జిల్లాలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. డీఆర్‌డీఏ పీడీ బి.బాలునాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ సూరజ్ గనోరే

క్లుప్తంగా

ఫొటోగ్రాఫర్ వంగపల్లి బ్రహ్మంకు జాతీయ పురస్కారం



వినుకొండ(నూజెండ్ల): వినుకొండకు చెందిన ఫొటోగ్రాఫర్ వంగపల్లి బ్రహ్మంకు జాతీయ స్థాయిలో పురస్కారం లభించింది. బ్రహ్మం తీసిన ఫొటోలను ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫీ (ఎఫ్ఐపీ) - పట్నా వారు అత్యున్నత గౌరవ పురస్కారానికి ఎంపిక చేశారు. గిరిజనుల జీవన విధానంపై తీసిన ఛాయాచిత్రాలకు నలుపు, తెలుపు విభాగంలో ఎఫ్ఐపీ పురస్కారం లభించింది. కేజీఎల్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఓ సమావేశంలో బ్రహ్మంను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెనలను సన్మానించారు. నగదు బహుమతి అందజేశారు.

క్రికెట్ మ్యాచ్ వర్షార్పణం

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో భాగంగా విజయనగరం, అనంతపురం జిల్లాల మధ్య మ్యాచ్ వర్షార్పణం అయింది. తొలిరోజు ఆట మాత్రమే జరగగా, మిగిలిన రెండు రోజులు వర్షం రావటంతో మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. తొలిరోజు ఆటలో అనంతపురం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 141 పరుగులు సాధించగా, విజయనగరం జట్టు 4వికెట్లు నష్టానికి 164 పరుగులు సాధించి 23 పరుగుల అధిక్యంలో నిలిచింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించిన విజయనగరం జట్టుకు మూడు పాయింట్లు, అనంతపురం జట్టుకు ఒక పాయింట్ కేటాయించారు.

నాదెండ్ల పీఏసీఎస్ సీఈఓగా చేకూరి ధనలక్ష్మి

ఉత్వర్వులు జారీ చేసిన రాష్ట్ర హైకోర్టు

నాదెండ్ల: నాదెండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) సీఈవోను నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు తీర్పు వెలువరించింది. సేకరించిన వివరాల మేరకు.. నాదెండ్ల గ్రామానికి చెందిన చేకూరి ధనలక్ష్మి నాదెండ్ల పీఏసీఎస్‌లో 1997లో క్లర్క్‌గా విధుల్లో చేరారు. 2016లో ఉన్నతాధికారులు ఆమెను పీఏసీఎస్ సీఈఓగా నియమించారు. 2019లో సొసైటీ త్రీమెన్ కమిటీ సిఫార్సుల మేరకు ఆమెను సీఈఓ పదవి నుంచి తొలగించటంతో క్లర్క్ పోస్టులో కొనసాగిస్తూ గణపవరం సొసైటీకి బదిలీ చేశారు. ఆమె దీనిపై ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించటంతో నాదెండ్ల సొసైటీ సీఈఓగా ధనలక్ష్మిని నియమిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది.

రైతులకు విత్తనాలు అందజేతలో ప్రభుత్వం విఫలం

- ఆర్‌బీకేలను నిర్వీర్యం చేసిన ప్రభుత్వం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: వ్యవసాయ సీజన్‌లో రైతులకు కావాల్సిన విత్తనాలు సకాలంలో అందజేయటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగార్జునసాగర్ నుండి కిందికి నీరు విడుదల చేయటం, కుడికాలువకు నీరు వస్తుండటంతో రైతులు మాగాణి సేద్యంపై దృష్టి సారించారన్నారు. కుడికాలువ ఆయకట్టు పరిధిలో ఈ ఏడాది 1.05లక్షల ఎకరాల్లో వరి పంట వేస్తారని వ్యవసాయాధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారన్నారు. దీనికి 35 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అన్నారు. ఇప్పటి వరకు కేవలం నాలుగు వేల క్వింటాళ్ల వరకే రైతులకు దక్కాయన్నారు. జేజీఎల్ 384రకం విత్తనాల కోసం నరసరావుపేటలో ఏపీ సీడ్స్ డీలర్ వద్ద తెల్లవారుజాము నుంచే మహిళలతో సహా రైతులు క్యూలో నిలబడాల్సిన పరిస్థితి దాపురించిందని, రైతులను రోడ్డుపై నిలబెట్టారని అన్నారు. 15రోజుల కిందట జేజీఎల్ రకం 30 కిలోల విత్తనాల బస్తా రూ.1350లకు విక్రయించగా ఇప్పుడు బ్లాక్‌లో రూ.2వేలకు అమ్ముతున్నారన్నారు. ఇప్పటికీ ఇంకా 27వేల క్వింటాళ్లు అందజేయాల్సి వుందన్నారు. రైతులు విత్తనాల కోసం ప్రైవేటు దుకాణాల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో ఆర్‌బీకేల ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సిద్ధం చేయటంతో వారు ఇబ్బందులు పడలేదు అన్నారు. ఇప్పుడు రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చి వాటిని నామమాత్రం చేశారన్నారు. రైతుకు పెట్టుబడి సాయం కింద గత ప్రభుత్వం ఏడాదికి రూ.13,500 ఇవ్వగా ఈ ప్రభుత్వం దాని ఊసే ఎత్తటంలేదన్నారు. గతేడాది 56వేల కౌలు రైతు కార్డులు ఇవ్వాలనేది లక్ష్యంకాగా 53వేలు కార్డులు ఇచ్చారని, ఈ ఏడాది 63వేల ఇవ్వాలనేది లక్ష్యంగా పెట్టుకోగా అందులో 35వేల కార్డులు ఇచ్చారన్నారు. మిర్చిధర పూర్తిగా తగ్గిందని, గతంలో రూ.25వేలు వరకు పలికిన క్వింటాలు ధర ఇప్పుడు రూ.12 నుంచి రూ.13వేలే పలుకుతుందన్నారు. ఆ పంటకు ఈ ఏడాది రైతులకు ప్రత్యామ్నాయం చూపించాల్సిన అవసరం ఉందనారు. ప్రతి ఏడాది జిల్లాలో వ్యవసాయ మండలి సమావేశం నిర్వహించే వారని ఈ ఏడాది దాని ఊసులేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, వ్యవసాయ మంత్రి మేలుకొని రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందజేసేందుకు సమీక్షలు నిర్వహించాలని సూచించారు.

ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల బాక్స్ తప్పనిసరి

ఏపీ రాష్ట్ర చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ గౌరవ సభ్యులు బి.పద్మావతి



మాట్లాడుతున్న సభ్యురాలు పద్మావతి, వేదికపై జేసీ సూరజ్ గనోరే

నరసరావుపేట: జువనైల్ జస్టిస్ యాక్ట్ ప్రకారం ప్రతి స్కూలులో పిల్లలకు అందుబాటులో ఫిర్యాదుల బాక్స్‌తోపాటు చిల్డ్రన్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఏపీ రాష్ట్ర చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ గౌరవ సభ్యులు బి.పద్మావతి పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని గుర్రం జాషువా సమావేశ మందిరంలో ఎడ్యుకేషన యాక్ట్ అమలు, చైల్డ్ రిలేటెడ్ యాక్ట్‌పై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల, గురుకులాలు, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్, కస్తూర్బా గాంధి, బీసీ, గురుకులాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బాలల హక్కులను అతిక్రమించరాదని అన్నారు. ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల బాక్సులు ప్రిన్సిపాల్ రూము, బీరువాలలో ఉంచరాదని, అవి పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలియచేయడానికని, అంతేకాని ఉపాధ్యాయులపై ఫిర్యాదులకు కాదని అన్నారు. రానున్న నెలరోజుల లోపల ఫీజు వివరాలు తెలిపే విధంగా నోటీస్ బోర్డుల్లో బహిరంగంగా ప్రదర్శించాలని, నిబంధనలు ఉల్లఘించిన వారికి నోటీసులు జారీ చేయడంతో పాటు రిజిస్ట్రేషన్ రద్దుచేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఎన్ని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో 25 శాతం దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న వారికి సీట్లు కేటాయించారో వివరాలు అందచేయాలన్నారు. పిల్లల సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబరు 1098, 100 నెంబర్ ప్రతి క్లాస్ రూములో ఉండేలా చూడాలన్నారు. ఐసీడీఎస్ పీడీ ఉమారాణి, డీసీడీవో రేవతి, ఉప విద్యాశాఖధికారి వేణుగోపాల్, ఆర్ఐవో పాల్గొన్నారు.

పరిశోధనల దిశగా ప్రోత్సహించాలి

డీఈఓ వెంకటేశ్వర్లు



జిల్లా సైన్స్ ఆఫీసర్‌గా పనిచేసిన మధుకుమార్‌ను సత్కరిస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల విద్య స్థాయి నుంచే విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఇన్‌స్పైర్ మానక్ నామినేషన్లపై జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈఓ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలలోని పాఠశాలల నుంచి సైన్స్ ప్రాజెక్టులు నామినేట్ చేసేలా కృషి చేయాలని సైన్స్ ఉపాధ్యాయులను కోరారు. ఉన్నత పాఠశాలల నుంచి ఐదుగురు విద్యార్థులు, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ముగ్గురు విద్యార్థులు ప్రాజెక్ట్‌లను తయారు చేసేలా ప్రోత్సహించాలని తెలిపారు. 13 సంవత్సరాలుగా జిల్లా సైన్స్ ఆఫీసర్‌గా సేవలు అందించిన ఏ.ఏ.మధుకుమార్‌ను ఘనంగా సత్కరించారు. మధుకుమార్ హయాంలో జిల్లాలోని విద్యార్థులకు ఎన్నోమార్లు అవార్డులు లభించాయని తెలిపారు. నూతన జిల్లా సైన్స్ ఆఫీసర్‌గా నియమితులైన ఎస్.రాజశేఖర్‌ను అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ కె.వేణుగోపాలరావు, ప్రధానోపాధ్యాయులు సీహెచ్.వీరప్పయ్య, ఆర్.శివనాగేశ్వరరావు, జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ వి.సీతారామయ్య, రిసోర్స్ పర్సన్స్ బీహెచ్‌వీ రఘురామ్, బి.శ్రీనివాసరావు, ఎం.అప్పారావు, కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఖైదీకి ఉచిత న్యాయ సహాయం

- సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి
- జిల్లా కారాగారంలో తనిఖీలు



భోజనం రుచి చూస్తున్న సివిల్ జడ్జి లీలావతి

నగరంపాలెం: గుంటూరు బ్రాడిపేటలోని జిల్లా కారాగారంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి టి.లీలావతి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా కారాగారంలోని లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను సందర్శించారు. ఉచిత న్యాయ సహాయం, సూచనల గురించి ఖైదీలకు వివరించారు. ప్రతి ఖైదీకి ఉచిత న్యాయ సహాయం త్వరితగతిన అందించేందుకు ఉన్న అవకాశాలను చెప్పారు. భోజనం, ఇతరత్రా సదుపాయాలపై ఆరా తీశారు. వాటిపై సంతృప్తి వ్యక్తం చేశారు. న్యాయ సహాయం కోసం అర్జీలు అందించాలని, తద్వారా ఉచితంగా వాదించేందుకు న్యాయవాదిని నియమించనున్నట్లు తెలిపారు. స్తోమత లేని ప్రతి రిమాండ్ ఖైదీకి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని పేర్కొన్నారు. నేరం జరిగే నాటికి 18 ఏళ్లు నిండకపోతే వారు బాలలే అని అన్నారు. ఏదైనా నేరం చేస్తే బాలల న్యాయ మండలి వద్ద హాజరుపర్చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టం మధుబాబు, జిల్లా జైలు సూపరింటెండెంట్ కె.రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

వియత్నాం బౌద్ధ బిక్షువుల వితరణ



మాదలలో చేతిపంపును ప్రారంభిస్తున్న వియత్నాం బౌద్ధ బిక్షువులు, ఎస్సై పీ.హజరతయ్య

మాదల(ముప్పాళ్ల): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బుద్ధిస్ట్‌లో పరిశోధకులుగా విద్యనభ్యసిస్తున్న వియత్నాం దేశ బౌద్ధ భిక్షువులు ధర్మదీపం ఫౌండేషన్, మంగళగిరి నిర్వహణలో మాదల ఎస్టీ కాలనీలోని పాఠశాల విద్యార్థులకు అవసరమైన మంచినీటి చేతిపంపును బుధవారం ప్రారంభించారు. విద్యలో భాగంగా దాన విశిష్టతను గుర్తించి ఎస్టీ కాలనీలో చేతిపంపును వేయించారు. అనంతరం మాదల, బొల్లవరం, ముప్పాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బౌద్ధ ధర్మానికి, నైతిక విలువలు, మానసిక వికాసం, ప్రకృతి పరిరక్షణకు చెందిన గ్రంథాలయ పుస్తకాలను అందించారు. మొత్తం రూ.2లక్షల15వేలతో పలు కార్యక్రమాలు చేపట్టారు. వీటితో పాటుగా సత్తెనపల్లి మండలంలోని గుడిపూడి ఎస్టీ కాలనీలోను, వెంకటపతి కాలనీలోను, గండ్లూరు బీసీ కాలనీలోను బోరు, చేతిపంపులను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఆయా పాఠశాలల్లోని చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమాల్లో సత్తెనపల్లి ఎంఈఓలు శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు, ఉపాధ్యాయులు కే.నాగేశ్వరరావు, మువ్వా సురేష్, కే.సాయిజగన్నాథం, మాతంగి సాంబశివరావు, ఎస్సై కే.హజరతయ్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాకే సర్దుబాటు చేయాలి

ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని



సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం హైస్కూలు ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్‌లుగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిన తర్వాతే సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో నంబర్ 117ను రద్దు చేయకుండా, పదోన్నతులు ఇవ్వకుండా సర్దుబాటు ప్రక్రియ చేపట్టిన పక్షంలో ఉపాధ్యాయుడు ఏ తరగతి బోధించాలో, ఎక్కడ పని చేయాలో తెలియని గందరగోళ పరిస్థితులు తలెత్తుతాయన్నారు. దీని వల్ల విద్యా ప్రమాణాలు దెబ్బతిని, నాణ్యతా లోపం ఏర్పడుతుందన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించిన తరువాతే ముందుకు వెళ్లాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉపాధ్యాయవర్గం ఉద్యమాలు చేపట్టవలసి ఉంటుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

బడికి గైర్హాజరైతే
కిట్లు వెనక్కి తీసుకుంటాం

తల్లిదండ్రులతో సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి



విద్యార్థుల తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడుతున్న విజయలక్ష్మి

ప్రత్తిపాడు: పాఠశాలకు వరుసగా మూడు రోజులు విద్యార్థులు గైర్హాజరైతే వారికి ప్రభుత్వం ఇచ్చిన స్టూడెంట్ కిట్ వెనక్కి తీసుకుంటామని సమగ్ర శిక్ష ఏపీసీ జి. విజయలక్ష్మి అన్నారు. ప్రత్తిపాడు మండలం వంగిపురం జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో స్థానిక విద్యాశాఖ అధికారులతో కలిసి బుధవారం ఏపీసీ తనిఖీలు నిర్వహించారు. జెడ్పీ హైస్కూలులో విద్యార్థుల సంఖ్యతోపాటు మధ్యాహ్న భోజనం తింటున్న వారు, డ్రాపౌట్స్ వివరాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం తిని, నాణ్యతను పరీక్షించారు. పాఠశాల పరిధిలో 21 మంది విద్యార్థులను డ్రాపౌట్స్ జాబితాలో చూపిస్తున్నారని, వారిని కలిసి ఎందుకు రావడం లేదో విచారణ చేయాలని హెచ్ఎం నాగేశ్వరరావును ఆదేశించారు. అనంతరం పాఠశాలకు హాజరు కాని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. గైర్హాజరుకు కారణాలను తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య తదితర వివరాలను హెచ్ఎం మరియరాజును అడిగారు. మొత్తం పన్నెండు మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులం ఉన్నామని, ఇద్దరు విద్యార్థులు సెలవు పెట్టారని హెచ్ఎం వివరించారు. గైర్హాజరైన తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఎందుకు రాలేదో ఏపీసీ తెలుసుకున్నారు. పాఠశాల పనిరోజుల్లో పిల్లలను తీసుకుని ఊళ్లకు వెళ్లడం సరికాదని, వరుసగా మూడు రోజులు విద్యార్థులు పాఠశాలకు రాకపోతే పేర్లు తీసివేయడంతోపాటు ఇచ్చిన స్టూడెంట్ కిట్‌ను వెనక్కు తీసుకుంటామని తల్లిదండ్రులకు చెప్పారు. అదేవిధంగా మైగ్రేట్ పిల్లలు ఎక్కడకు వెళ్లినా ఫాలోఅప్ చేసి వారు అక్కడ పాఠశాలల్లో చేరేలా హెచ్ఎంలు చర్యలు తీసుకోవాలన్నారు.

లెక్కలు లేకుంటే ఎలా..?

ప్రత్తిపాడు భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తనిఖీలు చేసిన ఏపీసీ అక్కడి ఎస్టీ కాలనీలో ఉన్న బడి ఈడు చిన్నారుల పూర్తి వివరాలను ఎంఈవో-2 జి. లీలారాణి, సీఆర్పీలను అడిగారు. సరైన సమాధానం రాకపోవడంతో లెక్కలు లేకుంటే ఎలాగని ప్రశ్నించారు. పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఆమె వెంట ఎంఈవో రమాదేవి, హెచ్ఎం హెచ్. శ్రీనివాసరావు తదితరులున్నారు.

కాకుమాను ఆరోగ్య కేంద్రంలో టైల్స్ ధ్వంసం



కాకుమాను: మండల కేంద్రం కాకుమాను గ్రామ సచివాలయం-2 పరిధిలో గత ప్రభుత్వంలో నిర్మించిన హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన టైల్స్‌ను బుధవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రవి ప్రసాద్, వెల్‌నెస్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. రోజు మాదిరిగానే మంగళవారం తమ విధులు ముగించుకుని సిబ్బంది వెళ్లారు. బుధవారం ఉదయం 9 గంటలకు విధులకు హాజరయ్యే సమయానికి వెల్‌నెస్ సెంటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన టైల్స్ ధ్వంసమై కనిపించాయి. నీటి పైపులు, నీటి కుంటను పూడ్చివేసినట్లు వారు తెలిపారు. జేసీబీతో ధ్వంసం చేసినట్లు ఆనవాళ్లు ఉన్నట్లు గుర్తించారు. విషయాన్ని జిల్లా వైద్యాధికారుల దృష్టికి తీసుకువెళ్లి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు డాక్టర్ రవి ప్రసాద్ తెలిపారు.

మద్యం తాగే విషయంలో వివాదం

- కారు డ్రైవర్‌పై ఇద్దరు యువకుల దాడి
- వారం కిందట చోటుచేసుకున్న సంఘటన
- చికిత్స పొందుతూ బాధితుడు మృతి
- దాడి కేసు హత్య కేసుగా మార్పు
- టూటౌన్ పోలీసుల అదుపులో నిందితులు



మృతి చెందిన కొత్తూరి నిరంజన్

నరసరావుపేట టౌన్: మద్యం తాగే విషయంలో వివాదం ఓ వ్యక్తి ప్రాణం తీసింది. కారు డ్రైవర్‌పై ఇద్దరు యువకులు దాడికి పాల్పడ్డారు. సంఘటనలో గాయపడ్డ బాధితుడు చికిత్స పొందుతూ వారం తర్వాత మృతి చెందటంతో విషయం వెలుగు చూసింది. దీంతో దాడి కేసును హత్యకేసుగా మార్పు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాష్‌నగర్‌కు చెందిన కొత్తూరి నిరంజన్(49) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ ఉంటాడు. గత నెల 31వ తేదీ మద్యం తాగేందుకు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల తిరుమల బార్ అండ్ రెస్టారెంట్ వద్దకు వెళ్లాడు. అక్కడ మద్యం కొనుగోలు చేసి బార్ ఎదుట ఖాళీగా ఉన్న బడ్డీ కొట్టు బంకులో మద్యం తాగుతున్నాడు. అదే సమయంలో ఇస్లాంపేటకు చెందిన షేక్ రిజ్వాన్, నూర్‌లు మద్యం తాగేందుకు బడ్డీ కొట్టువద్దకు వచ్చారు. అక్కడ వారి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో నిరంజన్‌పై రిజ్వాన్, నూర్‌లు దాడి చేసి కిందకు తోశారు. బండరాయికి తల తగలటంతో బలమైన రక్త గాయమైంది. బాధితుడిని ప్రథమ చికిత్స అనంతరం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య ఉషారాణితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మొదట దాడి కేసు నమోదు చేసిన టూటౌన్ పోలీసులు బాధితుడు మృతి చెందటంతో హత్య కేసుగా మార్పు చేశారు. దాడిలో పాల్గొన్న ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బుధవారం శవపంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భాస్కర్ తెలిపారు.

దాడి కేసులో మహిళకు ఏడాది జైలు శిక్ష

నరసరావుపేట టౌన్: దాడి కేసులో మహిళకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. చిలకలూరిపేట మండలం పురుషోత్తపట్నంకు చెందిన తోట అనంతలక్ష్మిపై బాకీ విషయంలో 2018 మే 12వ తేదీన అదే ప్రాంతానికి చెందిన కొండ సత్యవతి దాడికి పాల్పడింది. ఈ మేరకు బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో చిలకలూరిపేట పోలీసులు కేసు నమోదు చేసి ప్రాథమిక దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావటంతో నిందితురాలికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ చిలకలూరిపేట కోర్టు 2021 డిసెంబర్ 12న తీర్పు చెప్పింది. శిక్షపై నిందితురాలు జిల్లా కోర్టుకు అప్పీలు చేసుకోవటంతో దిగువ కోర్టు విధించిన శిక్షను యథావిధిగా అమలు చేస్తూ తీర్పు చెప్పారు.

బకింగ్‌హామ్ కెనాల్‌లో మహిళ గల్లంతు


తాడేపల్లి రూరల్: తాడేపల్లి వైఎస్సార్ సెంటర్ (కొత్తూరు) ఆంజనేయస్వామి దేవస్థానం ప్రాంతానికి చెందిన ఓ మహిళ బకింగ్‌హామ్ కెనాల్‌లో బుధవారం గల్లంతయ్యారు. సేకరించిన వివరాల ప్రకారం.. వైఎస్సార్ సెంటర్ (కొత్తూరు)లో నివాసం ఉంటున్న దాసరి పాండురంగారావు భార్య శివనాగమణి (58) ఇంట్లో పూజా సామగ్రి, ఇతర వస్తువులను కాలువలో కలిపేందుకు బయలుదేరారు. ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద మెట్ల మార్గంలో కిందికి దిగి కెనాల్ నీటిలో కలుపుతుండగా కింద పడిపోవడంతో ఆమె గల్లంతయ్యారు.

సీట్లు పెంచాకే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుకు డిమాండ్


గుంటూరు రూరల్: ఎంబీబీఎస్ సీట్లు విక్రయించడానికి అనుకూలంగా జీవో నెంబర్ 107, 108లను తీసుకొచ్చారని ఏపీ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఆ జీవోలను రద్దు చేయటంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు కళాశాలల్లో సీట్లు పెంచకుండా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ జనరల్ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఉన్న సీట్లను పెంచిన తరువాత మాత్రమే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టంలోనే ఉందని గుర్తు చేశారు. ఇప్పుడు ఓపెన్ సీట్లలో 10 శాతం కోత విధించి ఈడబ్ల్యూఎస్ అమలు చేయాలని ప్రభుత్వం ఎలా భావిస్తుందని ప్రశ్నించారు. ఈడబ్ల్యూఎస్‌కు తాము వ్యతిరేకం కాదని, ప్రైవేటు కళాశాలల్లో సీట్లు పెంచిన తరువాత మాత్రమే ఈ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 107, 108లను రద్దు చేయాలని, నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లోని మొత్తం సీట్లను ప్రతిభావంతులైన విద్యార్థులకే కేటాయించాలని కోరారు.

క్వారీ గుంతలో వ్యక్తి గల్లంతు

- ఎన్డీఆర్ఎఫ్ బృందంతో గాలింపు
- ఆందోళనలో కుటుంబ సభ్యులు
- 24 గంటలు గడిచినా లభించని ఆచూకీ



గాలింపు చేస్తున్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందం



గల్లంతైన హనుమంతరావు

పిడుగురాళ్ల: పుల్కా తినేందుకు దాబాలో కూర్చున్న సమయంలో ఒక్కసారిగా పోలీసులు సైరన్ వస్తుండటంతో భయపడి పరుగు తీసే క్రమంలో పంజాబీ డాబా వెనుక ఉన్న క్వారీ గుంతలో పడి వ్యక్తి గల్లంతైన సంఘటన పిడుగురాళ్ల పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సమాచారం మేరకు... పిడుగురాళ్ల పట్టణానికి చెందిన నాయిని హనుమంతరావు (36)తోపాటు మరో ఇరువురు జెమిని, వెంకటేశ్వర్లు పంజాబీ దాబాలో పుల్కా తినేందుకు వెళ్లారు. అప్పటికీ సమయం అర్ధరాత్రి 12 గంటలు అవుతుంది. పిడుగురాళ్ల పట్టణ సీఐ రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పంజాబీ దాబాలో లైట్లు వెలుగుతుండటంతో సైరన్ వేసుకుంటూ పోలీసులు అక్కడకు వెళ్లారు. పోలీసులు కొడతారేమోనని భయంతో ముగ్గురు పరుగులు తీశారు. నాయిని హనుమంతరావు డాబా వెనుక వైపు పరుగులు తీశాడు. ఆ ప్రాంతమంతా చీకటిగా ఉండటంతో క్వారీ గుంత కనిపించక అందులో పడిపోయాడు. గమనించిన పంజాబీ దాబాలో పనిచేసే వర్కర్ హిందీలో డాబా నిర్వాహకుడికి చెప్పాడు. అతను పట్టణ సీఐ వెంకట్రావుకు సమాచారం ఇచ్చాడు. వెంటనే గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతు అయిన హనుమంతరావుకు చెందిన చెప్పులు కనిపించడంతో దాని ఆధారంగా గల్లంతైనట్లు గుర్తించారు. గజ ఈతగాళ్లకు హనుమంతరావు కనిపించలేదు. బుధవారం సాయంత్రం ఎస్‌డీఆర్ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. 24 గంటల తరువాత పూర్తి సమాచారం వస్తుందని పట్టణ సీఐ తెలిపారు. బుధవారం రాత్రి 10 గంటలకు గల్లంతైన హనుమంతరావు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు రోదనలో మిగిలిపోయారు. సమాచారం తెలుసుకున్న గురజాల డీఎస్పీ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకట్రావు తెలిపారు.